క్లుప్తంగా

నెట్టికంటుడి సన్నిధిలో పత్తికొండ ఎమ్మెల్యే



స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

గుంతకల్లు రూరల్: పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి గురువారం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆలయానికి విచ్చేసిన ఆమెకు ఆలయ అధికారులు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు ఆమెకు స్వామి తీర్థప్రసాదాలను అందజేశారు.

విద్యార్థి చదువుకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లు రూరల్: పులగుట్టపల్లి పెద్దతండా గ్రామానికి చెందిన చిన్నస్వామి నాయక్ కుమారుడి చదువు కోసం ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి రూ.25 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. గడప గడపకూ కార్యక్రమంలో భాగంగా పులగుట్టపల్లి పెద్దతండాలో ఎమ్మెల్యే పర్యటించిన సమయంలో పార్టీ కార్యకర్త చిన్నస్వామి నాయక్ ఆర్థిక పరిస్థితి బాగోలేక కొడుకు చదువు కష్టంగా మారిందని తెలుసుకున్నాడు. చిన్నస్వామి నాయక్ కొడుకు చదువు కోసం తనవంతు ఆర్థిక సహాయాన్ని అందజేస్తానని అప్పట్లో ప్రకటించారు. ఈ మేరకు ఎమ్మెల్యే గురువారం తన క్యాంపు కార్యాలయంలో రూ.25 వేల చెక్కును అందజేశారు. ఈసందర్భంగా చిన్నస్వామి నాయక్‌తోపాటు, గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రంపై అవగాహన



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఆర్‌డీఓ శ్రీనివాసులు రెడ్డి

గుంతకల్లుటౌన్: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల వినియోగంపై అధికారులు పురప్రజలకు అవగాహన కల్పించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గురువారం స్థానిక పాతబస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆర్‌డీఓ శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి, డిటీ రాములు ఈవీఎంలో ఓటు నమోదు, లెక్కింపుపై తెలియజేశారు. దేశంలో ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించడానికి ఎన్నికల సంఘం అనేక సంస్కరణలను ప్రవేశపెట్టిందన్నారు. ఈవీఎం, వీవీప్యాట్, నోటా లాంటి కొత్త విధానాలతో ఓటర్లకు భరోసానిచ్చిందని వారు చెప్పారు.

19 నుంచి కులగణన సర్వే

పెద్దపప్పూరు: ఈనెల 19 నుంచి మండల వ్యాప్తంగా కులగణన సర్వే చేపడుతున్నట్లు ఎంపీడీఓ రామకృష్ణ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 19 నుంచి 28 వరకు సర్వే కొనసాగుతుందని తెలిపారు. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ తిరిగి సర్వే చేస్తారని పేర్కొన్నారు. ఎటువంటి సందేహాలు ఉన్నా సర్వే కోసం వచ్చిన వారికి వివరించాలని మండల ప్రజలకు ఆయన తెలియజేశారు.

పత్ర కులస్తులను బీసీ-ఏలో చేర్చాలి



డీటీకి వినతిపత్రం అందజేస్తున్న పత్ర సంఘం నాయకులు

గార్లదిన్నె: ప్రభుత్వం పత్ర కులస్తులను బీసీ-ఏ కింద చేర్చాలని పత్ర సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతరాయుడు పేర్కొన్నారు. గురువారం పత్ర సంఘం నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం త్వరలో చేపట్టే కులగణన సర్వేలో బీసీ ఏ కింద చేర్చాలన్నారు. పత్ర కులస్తులను బీసీ-ఏ కింద చేర్చాలని 2006లో ప్రభుత్వం జీఓ విడుదల చేసిందన్నారు. అయితే అధికారులు జీఓ అమల్లో జాప్యం చేస్తున్నారన్నారు. కేంద్రం ప్రభుత్వం పత్ర కులాన్ని ఓబీసీ జాబితాలో చేర్చిందన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రం డిప్యూటీ తహసీల్దార్ విజయకుమార్‌కు అందజేశారు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస నాయుడు, గౌరవాధ్యక్షుడు ఆంజనేయులు, జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులు చీమల శ్రీనివాసులు, రమేష్ బాబు, రాము, శివరాం, రమణ, ఓం ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ఆడుదాం ఆంధ్రా పోటీలు



గార్లదిన్నెలో కబడ్డీ ఆడుతున్న యువకులు



శింగనమల: పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు

యల్లనూరు: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల, చిలమకూరు మోడల్ స్కూల్ క్రీడా మైదానాల్లో గురువారం ఆడుదాం ఆంధ్రా పోటీలు ఉత్సాహంగా సాగాయి. క్రికెట్, ఖోఖో, బ్యాడ్మింటన్, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వీరరాజు, ఎంఈఓలు చంద్రశేఖర్, పరమేశ్వర్‌రెడ్డి, పీడీలు, పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

గార్లదిన్నె: పట్టుదల ఉంటే క్రీడల్లో రాణించవచ్చునని ఎంపీడీఓ విజయభాస్కర్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో రెండో రోజు మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా పోటీలు జరిగాయి. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారుల్లో ప్రతిభను గుర్తించడాని ప్రభుత్వం పోటీలు నిర్వహిస్తోందన్నారు.

శింగనమల: శింగనమల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా పోటీలు జరిగాయి. వాలీబాల్ బాలుర విభాగంలో తరిమెల, కబడ్డీలో తరిమెల, బ్యాడ్మింటన్‌లో తరిమెల, బాలికల విభాగం ఖోఖోలో సీ.బండమీదపల్లి, బ్యాడ్మింటన్‌లో శింగనమల జట్లు గెలుపొందాయి. గెలుపొందిన జట్లను ఎంపీడీఓ నిర్మలాకుమారి అభినందించారు. పీడీలు నందకుమార్, బయపరెడ్డి, నరసింహారెడ్డి, శ్రీనివాసరెడ్డి, శిరీష, నరేంద్రరెడ్డి, స్వర్ణ పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : దిమ్మగుడి, పెద్దవడుగూరు జెడ్పీ ఉన్నత పాఠశాలల క్రీడా మైదానాల్లో గురువారం ఆడుదాం ఆంధ్రాలో భాగంగా క్రికెట్ పోటీలు నిర్వహించారు. మండల స్థాయిలో ప్రతిభ చాటిన



యల్లనూరు మోడల్ స్కూల్‌లో క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు

జట్లను నియోజక వర్గ స్థాయికి ఎంపిక చేస్తామని ఎంపీడీఓ కుళ్లాయిస్వామి, ఎంఈఓ రాముడు, పీఈటీలు లింగరాజు, రామచంద్రబాబు తెలిపారు.

మరోసారి వైఎస్సార్‌సీపీ విజయం ఖాయం

గుత్తి: త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మరోసారి విజయ దుందుభి మోగించడం ఖాయమని ఆ పార్టీ శ్రేణులు ధీమా వ్యక్తం చేశాయి. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం సీనియర్ నేత శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ బిందె వరలక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షురాలు చంద్రగిరి రాధమ్మ, మాజీ జెడ్పీటీసీ ప్రవీణ్‌కుమార్‌యాదవ్, పట్టణ, మండల కన్వీనర్లు పీరా, గోవర్ధన్‌రెడ్డి, సచివాలయ పట్టణ, మండల కన్వీనర్లు రంగస్వామి, సుభాష్‌రెడ్డి, జిల్లా నాయకులు రాజ్‌కుమార్‌రెడ్డి, భీమలింగప్ప విలేకరులతో మాట్లాడారు. గుంతకల్లులో జరిగిన సామాజిక సాధికార బస్సు యాత్ర ఊహించనంతగా విజయవంతమైందన్నారు. బస్సుయాత్రను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో మరోసారి రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాబోతుందన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ, సీపీఐ, కాంగ్రెస్, సీపీఎం కలిసి వచ్చినా గెలిచేది తమ పార్టీనేనన్నారు. సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధే పార్టీని గెలిపిస్తాయన్నారు. సంక్షేమం,



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

అభివృద్ధి రెండు కళ్లుగా భావించి సీఎం వైఎస్ జగన్ పాలన సాగిస్తున్నారన్నారు. ఎవరు ఎన్ని కుట్రలు, కుంత్రాలు చేసినా, ఎల్లో మీడియా ఎన్ని తప్పుడు రాతలు రాసినా గెలుపును ఆపలేరన్నారు. జిల్లా నాయకులు విశ్వనాథ్‌రెడ్డి, సునీల్, కౌన్సిలర్లు వరదరాజులు, ఫరూక్, కేవీ రమణ, నరేష్, వెంకటసుబ్బయ్య, సర్పంచులు గోపాల్, గురు మస్తాన్, చిదంబరి, సీనియర్ నాయకులు హమాలి రామాంజి, అరటి పండ్ల చంద్ర, జీపు రమణ, కటిక ఖురేషి అన్వర్, నూర్ నాయక్, మర్తాడు దాదా పీర్, రామరంగారెడ్డి, నారాయణస్వామి, హనుమంతు, అనగాన దొడ్డి రాజు, ఈరన్న,కుమర్ తదితరులున్నారు.

ఉత్తమ సేవలకు ఎస్పీ అభినందన



సీఐ రామసుబ్బయ్యకు ప్రశంసాపత్రాన్ని అందిస్తున్న ఎస్పీ అన్బురాజన్



ప్రశంసాపత్రం అందుకుంటున్న ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి

గుంతకల్లుటౌన్: గతేడాది నవంబర్ పట్టణంలో వరుస చోరీలకు పాల్పడిన మహారాష్ట్రకు చెందిన నిందితులను అరెస్ట్ చేసిన వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్యను జిల్లా ఎస్పీ అన్బురాజన్ అభినందించారు. గురువారం ఎస్పీ తన కార్యాలయంలో సీఐ రామసుబ్బయ్యకు ప్రశంసాపత్రం అందజేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన సాయంతో నిందితులను పట్టుకున్నందుకు రివార్డులను అందించారు.

యాడికి: మండలంలోని 14 పంచాయతీల్లోని 37 గ్రామాల్లో ఎటువంటి గొడవలు, అల్లర్లు జరగకుండా విధులు నిర్వహించిన ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డిని ఎస్పీ నుంచి ప్రశంసలు దక్కాయి. ఈ మేరకు గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ అన్బురాజన్ ప్రశంసాపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఎస్ఐను ఏఎస్ఐలు వెంకటేష్, రామాంజనేయులు, సిబ్బంది అభినందించారు.

నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలి

గుంతకల్లు: నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ గుంతకల్లు డివిజన్ ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక డీఆర్ఎం కార్యాలయం వద్ద యూనియన్ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షన్ ఉద్యోగి హక్కు అన్నారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ సాధన కోసం ఏళ్ల తరబడి రైల్వే కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టినా కేంద్ర ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకోకుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని లేని పక్షంలో ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. యూనియన్ సహాయ కార్యదర్శులు కేఎం



నిరహార దీక్షలో పాల్గొన్న యూనియన్ నాయకులు

డీ గౌస్, అశ్విని, కోశధికారి శ్రీనివాసశర్మ, డివిజనల్ మాజీ సహాయ కార్యదర్శి మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

పెద్దవడుగూరు: ఇరువర్గాల ఘర్షణకు సంబంధించి మండలంలోని క్రిష్టిపాడు గ్రా మ ఎస్సీ కాలనీకి చెందిన 8 మందిపై కేసు నమోదు చేశారు. వివరాలు... బుధవారం రాత్రి నాగభూషణం, వీరాంజనేయుల వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఇర్గువర్గాల వారు పరస్పరం దాడులు చేసుకున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలం వద్దకు చేరుకొని పరిస్థితిని అదుపుచేశారు. ఇరు వర్గాల వారు గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు 8 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

దేశ ఔన్నత్యానికి సంస్కృతి సంప్రదాయాల దోహదం

గుంతకల్లు: దేశ ఔన్నత్యానికి సంస్కృతి, సంప్రదాయాలు దోహదపడుతాయని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున పేర్కొన్నారు. పట్టణంలోని టెండర్ రూట్స్, సమేధా ఇంగ్లిష్ మీడియం ఆధ్వర్యంలో వైట్ హౌస్ ఫంక్షన్ హాల్‌లో ఏక్తా ఉత్సవ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కమిషనర్‌తోపాటు జేవీవీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ హరిప్రసాద్ హాజరై మాట్లాడారు. సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. గంగిరెద్దుల బండిని ముందుకు తోలి ఉత్సాహం నింపారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ వసుంధర, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఎద్దుల బండిని తోలుతున్న కమిషనర్ మల్లికార్జున

గొర్రెల అపహరణ

గార్లదిన్నె: కల్లూరులో బుధవారం అర్ధరాత్రి 15 గొర్రెలను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన ఆంజనేయులు గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో గొర్రెలు మందతో నిద్రించాడు. అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు ఆంజనేయులుపై దాడి చేసి 15 గొర్రెలను వ్యానులో ఎత్తుకెళ్లారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలం వద్దకు వెళ్లి దుండగులు ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఇదిలా ఉండగా గురువారం తెల్లవారుజామున విడపనకల్లు మండలంలో గొర్రెలు దొంగలించుకెళ్తున్న వ్యాన్ బోల్తాపడినట్లు గార్లదిన్నె పోలీసులకు సమాచారం అందింది. నిందితులు కర్ణాటకకు చెందిన వారిగా గుర్తించినట్లు సమాచారం

అంగన్‌వాడీ కార్యకర్తలకు నోటీసుల జారీ



పెద్దవడుగూరులో అంగన్‌వాడీ కార్యకర్త ఇంటికి నోటీసులు అతికిస్తున్న దృశ్యం

పెద్దవడుగూరు : మండలంలోని అంగన్‌వాడీ వర్కర్లకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నోటీసులు జారీ చేశారు. గురువారం పంచాయితీ క్యాదర్శులు, మహిళా పోలీసుల సహకారంతో అంగన్‌వాడీ కార్యకర్తల ఇళ్లకు వెళ్లి నోటీసులు అందించారు. కార్యకర్తలు విధులకు హాజరు కావాలని ప్రభుత్వం నోటీసుల్లో తెలిపింది. విధులకు హాజరు కానివారిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొంది.

అయోధ్య రాముడి పాదుకల ఊరేగింపు



పామిడిలో అయోధ్య రాముని పాదుకల ఊరేగింపు దృశ్యం

పామిడి: పట్టణవీధుల్లో గురువారం అయోధ్య రాముడి పాదుకల ఊరేగింపు నిర్వహించారు. రామేశ్వరం నుంచి అయోధ్యకు వెళ్తున్న శ్రీరాముడి పాదుకలు పామిడికి చేరుకున్నాయి. ఈసందర్భంగా శ్రీరాముని చిత్రపటంతో పాటు పాదుకలను పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామి పాదుకలను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

నేడు జగన్న ఆరోగ్య సురక్ష శిబిరం

పెద్దవడుగూరు: స్థానిక గ్రామ పంచాయితీ కార్యాలయం వద్ద శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కుళ్లాయిస్వామి, డాక్టర్ శ్రీనివాసబాబు, అమర్‌నాథ్ తెలిపారు. ప్రజలు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పెద్దపప్పూరు: మండలంలోని ముచ్చుకోట గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామకృష్ణ పేర్కొన్నారు. ప్రత్యేక వైద్యాధికారులు వచ్చి వివిధ ఆరోగ్య సమస్యలకు సంబంధించి పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా పంపిణీ చేస్తారన్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

యల్లనూరు: పీఎం కొండాపురంలో గురువారం సాయంత్రం రమేష్ నాయుడు అనే వ్యక్తి మద్యం విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. నిందితుడి నుంచి 35 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ధరణీ బాబు తెలిపారు.

జూదరుల అరెస్ట్

తాడిపత్రి: మార్కెట్ యార్డు సమీపంలో జూదమాడుతున్న ఏడుగుని గురువారం అరెస్ట్ చేసినట్లు ట్రైనీ డీఎస్పీ హేమంత్ కుమార్ తెలిపారు. నిందితులు ఆదినారాయణరెడ్డి, గంపయ్య, రామకృష్ణారెడ్డి, హనుమంతరెడ్డిలతో పాటు మరో ముగ్గరి నుంచి రూ. 26 వేలు స్వాధీనం చేసుకున్నామన్నారు.

అంబేడ్కర్ స్మృతివనం చరిత్రాత్మకం



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

● ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

గుంతకల్లుటౌన్: విజయవాడ స్వరాజ్ మైదానంలో నిర్మించిన అంబేడ్కర్ స్మృతివనం చరిత్రాత్మకమైనదని గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి అన్నారు. గురువారం తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ నెల 19న జరగనున్న అంబేడ్కర్ విగ్రహవిష్కరణ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆయన విడుదల చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్రకు అద్దం పట్టేలా జగనన్న ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా 125 అడుగుల విగ్రహం, స్మృతివనం దేశానికే గర్వకారణమన్నారు. ఆ మహనీయుడి అడుగుజాడల్లోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం పాలన సాగిస్తోందని చెప్పారు. 19న జరిగే విగ్రహావిష్కరణకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ ఎస్సీసెల్ జోనల్ ఇన్‌చార్జ్ జింకల రామాంజినేయులు, మున్సిపల్ మాజీ చైర్మన్ రామలింగప్ప, కౌన్సిలర్లు విద్యారాణి, కుమారి, సుధాకర్, నగేష్, ఎస్టీ సెల్ కన్వీనర్ గోవింద్‌నాయక్, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శులు బావన్న, ముని,పట్టణ అధ్యక్షుడు ప్రతాప్, మాజీ కౌన్సిలర్ రంగన్న, వార్డు ఇన్‌ఛార్జ్‌లు శేఖర్, బ్రహ్మ, పార్టీ జిల్లా కార్యదర్శి నాగేంద్ర, మాజీ సర్పంచ్ లాలెప్ప, పెయింటర్ హరి, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వడ్డే ఓబన్న జయంతి



యాడికిలో వడ్డే ఓబన్న జయంతి నిర్వహిస్తున్న నాయకులు



గుత్తిలో వడ్డే ఓబన్న విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

యాడికి: మండల కేంద్రంలోని గాంధీ కూడలి వద్ద గురువారం తొలి స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతిని వడ్డెర కార్మిక సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. అనంతరం ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఓబన్న చిత్రపటాన్ని మండల కేంద్రంలోని పురవీధుల్లో డప్పు వాయిద్యాల నడుమ ఊరేగించారు. ఈ సందర్భంగా వడ్డెర కులస్తులు ఓబన్న సమాజానికి అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, వడ్డెర నాయకులు పాల్గొన్నారు.

గుత్తి: స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న చిరస్మరణీయుడని మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ అన్నారు. పట్టణంలోని మన్రో సత్రం సమీపంలో గురువారం వడ్డెర సంఘం నాయకుల ఆధ్వర్యంలో వడ్డే ఓబన్న 217వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చైర్‌పర్సన్ ఓబన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వడ్డెర సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మీదేవి వడ్డే ఓబన్న గొప్పతనం, జీవిత చరిత్రను వివరించారు. వడ్డెర సంఘం జిల్లా నాయకులు వరదరాజులు, కమిటీ సభ్యులు జేసీబీ చంద్ర, వెంకటరాముడు, తిరుపాల్, మోహన్, వెంకటమ్మ, శివ, సుంకన్న, ఆంజనేయులు, గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయ భాస్కర్, వైఎస్సార్ సీపీ నాయకులు షఫి, కటిక ఖురేషి అన్వర్, నూర్ నాయక్, మర్తాడు దాదాపీర్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోండి

గుంతకల్లు రూరల్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో వెంకటరమణప్ప, ఏఓ స్వాతి సూచించారు. గురువారం జీ.కొట్టాల గ్రామంలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వివిధ శాఖల మండల స్థాయి అధికారుల కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు.

గుంతకల్లుటౌన్: పట్టణంలోని ఐదు ప్రదేశాల్లో శుక్రవారం నుంచి వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించనున్నారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు రాయల్ సర్కిల్, 13వ తేదీ ఉదయం సరోజినినాయుడు మున్సిపల్ స్కూల్, మధ్యాహ్నం గాంధీ చౌక్, 14న ఉదయం అరవింద్‌నగర్, మధ్యాహ్నం గుంతకల్లు రైల్వేస్టేషన్‌లో కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. పట్టణ ప్రజలు పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

గుత్తి: పట్టణంలోని ఆర్అండ్‌బీ బంగ్లా వద్ద గురువారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, డాక్టర్ బిందు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



గ్రామసభ నిర్వహిస్తున్న దృశ్యం

పామిడి: మండలంలోని జీ కొట్టాల గ్రామంలో గురువారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కేంద్ర ప్రభుత్వం వర్తింపజేస్తున్న 17 పథకాలను వక్తలు వివరించారు. ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్, సర్పంచ్ పెరమసాని లక్ష్మమ్మ, అధికారులు, సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

గుంతకల్లుటౌన్: జగనన్న సంక్రాంతి సంబరాల్లో భాగంగా మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని, మెప్మాల ఆధ్వర్యంలో నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీలు ఎంతో ఉత్సాహంగా సాగాయి. గురువారం చైర్‌పర్సన్ భవాని ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డులో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో మహిళలు అందమైన ముగ్గులు వేశారు. హరివిల్లు వర్ణాలు ప్రతిబింబించేలా ముచ్చటైన ముగ్గులు వేసి తమ సృజనాత్మకతను చాటుకున్నారు. సామాజిక చైతన్యం కలిగించడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించి వేసిన ముగ్గులు అందరినీ ఆకర్షించాయి. ఈ పోటీల్లో గెలుపొందిన శ్రీలక్ష్మి, బ్రాహ్మణి, వాణిలను ఫైనల్స్‌కు ఎంపిక చేయడంతో పాటు పోటీల్లో పాల్గొన్న 218 మందికి చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి, కమిషనర్ మల్లికార్జున, మాజీ చైర్మన్ రామలింగప్ప బహుమతులు అందజేశారు. 13వ తేదీన తిలక్‌నగర్ సరస్వతీ విద్యామందిరం వద్ద 37 వార్డుల్లో గెలిచిన మొదటి ముగ్గురి చొప్పున 111 మందికి ఫైనల్స్ నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మెహరున్నీసా, మహాలక్ష్మి, కుమారి, సుధాకర్, చాంద్‌బాషా, మెప్మా టీపీఆర్‌ఓ మోహన్, సీఎంఎం భవానీ, సీఓలు, ఆర్‌పీలు పాల్గొన్నారు.



విజేతకు బహుమతి అందిస్తున్న చైర్‌పర్సన్ భవాని, వీసీ నైరుతిరెడ్డి